ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 37-38

# ఆత్రేయ 'వాగ్దానం'

భమిడిపాటి గౌరీ శంకర్

**స్థూల సంగ్రహం:** స్థూలంశం: అరవైల ప్రాంతంలో బెంగాలీ సాహిత్య ప్రభావం తెలుగు చిత్ర పరిశ్రమ పైన ఎక్కువగా ఉందనుకోవాలి. బడాదీదీ, దేవదాసు, అర్ధాంగి, వాగ్దానం వంటి చిత్రాలు కొన్ని బెంగాలీ నవలల ఆధారంగానే రూపొందాయి. అయితే అన్ని విజయాలు సాధించలేదు. ప్రజారంజకమైన కథనాలు, పేరున్న తారాగణం, మంచి పాటలు, చక్కని సంగీతం ఇన్ని హంగులున్నా పరాజయం పాలైన చిత్రాలున్నాయి. వాటిలో 'వాగ్దానం' ఒకటి. అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణకుమారి, నాగయ్య, గుమ్మడి, చలం, గిరిజ, రేలంగి, సూర్యకాంతం, పద్మనాభం తదితరులు నటించారు. చిత్రం 1961 లో విడుదలై (5 అక్టోబర్) నిర్మాతకు నష్టాన్ని చూపించింది. ఈ చిత్రం విశేషం ఏమిటంటే రచన, దర్శకత్వం ఆచార్య ఆత్రేయ నిర్వహించడం. దాశరధి, శ్రీశ్రీ, నార్ల చిరంజీవి వంటి వారితో కలిసి ఆత్రేయ నాలుగు పాటలు వ్రాశారు. పెండ్యాల నాగేశ్వరరావు మంచి సంగీతాన్ని సమకూర్చారు. 'నా కంటి పాపలో' (దాశరధి), 'వెలుగు చూపవయ్యా' (ఆత్రేయ) , 'శ్రీ నగజా తనయం' ( హరికథ- శ్రీశ్రీ) వంటివి నేటికీ వినిపిస్తుంటాయి. నిర్మాతలు సత్యనారాయణ, శ్రీరామ మూర్తులు. ఆ రోజుల్లో శ్రీశ్రీ రాసిన 'హరికథ' విశేషంగా శ్రోతలను ఆకట్టుకుందనే చెప్పాలి. ఆకాశవాణిలో ఎక్కువగా వినిపించేది. ఈ సినిమా కథకు మూలం శరశ్చంద్ర బెంగాలీ నవల 'దత్త'.

**కీలకపదాలు:** సాహిత్య, వాగ్దానం, బెంగాలీ, జ్ఞానము ,విద్య.

**ఆత్రేయ చిత్ర పరిచయం**: చిత్రం ఆత్రేయను మంచి దర్శకునిగా చిత్ర సేవకు పరిచయం చేసింది. కానీ... విజయవంతమైన దర్శకుడుగా మాత్రం పేరు రాలేదు. ఆత్రేయ కథను ఎక్కడా బెంగాలీ వాసనలు లేకుండా నడిపారు. సాధ్యమైనంత వరకు సి. పుల్లయ్య, ఆదుర్తి దర్శకత్వ ఒరవడిని అనుసరించారు. సూర్యకాంతం, రేలంగి, పద్మనాభముల మధ్య హాస్యం పరవాలేదనిపిస్తుంది. ఆనాటి ప్రేక్షకులకు కావలసిన నటులు, మంచి కథ ఉన్నప్పటికీ ఆత్రేయను నిరాశపరిచింది. ఆత్రేయతో కలిసి స్క్రీన్ ప్లేను బొల్లి ముంత శివ రామకృష్ణ కూడా చేశారు. బాగానే ఉంటుంది. కానీ... లోపం ఏమిటో నాటి సిని విశ్లేషకులు గ్రహించలేకపోయారనేది ఓ విశ్లేషణ. కథ పరంగా ఇది కూడా ఓ జమిందారి కథ. జమీందారు (విశ్వనాథం) నాగయ్య దగ్గరున్న (రంగనాథం) దివాన్ గుమ్మడి మరియు జగన్నాథం స్నేహితులు. జగన్నాథం కులం తక్కువ పిల్లను వివాహం చేసుకొని గ్రామ బహిష్కరణకు గురవుతాడు. తాగుడుకు అలవాటు పడతాడు. ఇతని కొడుకు (సూర్యం) అక్కినేని. జమీందారు కూతురు (విజయ) కృష్ణకుమారి. సూర్యం డాక్టర్ చదివి ఓ ప్రజాసుపత్రి స్థాపించడం, విజయ సూర్యంల ప్రేమ కథకు రంగనాథం జమిందారి ఆస్తికోసం తడి గుడ్డతో గొంతులు కోసే విధంగా వ్యవహరించి తన కొడుకు 'చలం'కు కృష్ణకుమారితో వివాహం చేద్దామనుకోవటం, సూర్యం దగ్గర నర్సు గా ఉండే రాధా (గిరిజ)తో అనుబంధాన్ని తప్పుగా చూపించి విజయ మనసు విరచడం, భాగవతార్ (రేలంగి) అతని భార్య (సూర్యకాంతం) సహాయంతో నిజం తెలుసుకోవడం వంటి సాధారణ ముగింపుతో చిత్రం 'శుభం' కార్డు పడుతుంది. నాటి సగటు ప్రేక్షకులు ఆశించే 'మలుపులు' సినిమాలో కాస్త 'స్లో' నరేషన్ తో దర్శకుడు చిత్రించిన విధానం నిరాశకు గురిచేస్తుంది. నాగేశ్వరరావు కృష్ణకుమారి పాత్రలు ఎంతో హుందాగా ఉంటాయి 'వన్నెచిన్నెలున్న' అనే పాటలో కృష్ణకుమారి ఎంతో పరిణితితో హావభావ ప్రకటన వెనుక ఆత్రేయ ప్రతిభను తెలుపుతుంది. 'శ్రీనగజ' హరికథలో రేలంగి మాటలు, ఘంటసాల గానం, పద్మనాభం, సూర్యకాంతంలో నటన హాస్యం అందిస్తుంది. ఇక్కడ సెట్

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 37-38

ప్రాపర్టీ కూడా నాటి రోజులను ప్రస్ఫుటంగా చూపిస్తుంది. నూట యాభై మూడు నిమిషాల నిడివి గల చిత్రంలో 'గుమ్మడి'ది పరిపూర్ణమైన 'పాత్ర'. అతని నటన 'న భూతో... '. చక్కని మేనరిజం తో అతని 'విలనీ' అతని ఎందుకు మహానటుగా కీర్తి పొందాడో తెలుపుతుంది. నమ్మించి ద్రోహం చేసి, అది కూడా ఎంతో సహజమనిపించే విధంగా చిత్రించి ఎదుటివారికి చూపగల ప్రతిభను అవలీలగా చేశారు గుమ్మడి. ఆత్రేయలోని మంచి దర్శకుడు అన్నింట కనిపిస్తాడు. కానీ... 'నాటకీయత' (బెంగాళీ వాసన) చిత్రంలో ఎక్కువ. కథనం కొన్నిచోట్ల పాత్రలను తేల్చివేస్తుంది. హీరో హీరోయిన్ల మధ్య (ఒక్కటి) తప్ప డ్యూయెట్స్ లేవు. నాగేశ్వరరావును అంతకుముందు 'ఎవెర్ గ్రీన్' గా చూసిన వారికి ఈ సినిమాలోని సూర్యం పాత్ర ఇబ్బంది పెడుతుంది. కృష్ణకుమారి పాత్ర (విజయ)ముందు కొన్ని సన్నివేశాలలో సూర్యం పాత్ర తేలిపోతున్నట్లుగా ఉంటుంది. ఎడిటింగ్ చేసిన ఎన్.ఎస్. ప్రకాష్ రావు, కెమెరా పి.ఎల్. రాయ్, వీ. రాఘ్లు ప్రతిభ సినిమాలో కనిపిస్తుంది.

**వాగ్దానం' చిత్ర దర్శకత్వం** 'ఆత్రేయ' అని తెలియని వారు దర్శకుడు సి. పుల్లయ్య అనుకుంటారని కొంతమంది అభిప్రాయం. వారిద్దరి మధ్య అనుబంధం అటువంటిది. ఆదుర్తి ప్రభావం 'పాటల' విషయంలో కనిపిస్తుంది ('నా కంటిపాపలో.. '). దుస్తులు విభాగం కూడా ఒక కొత్తదనాన్ని ప్రదర్శించిందని చెప్పాలి. కళా దర్శకుడు చక్కని పనితనం కనిపింపజేశాడు. ఆత్రేయ బేసిక్ గా మంచి రచయిత (నాటక రచయిత). ఎన్.జి.వో., కప్పలు వంటి రచనలు ఈ అంశాన్ని ప్రస్ఫుటం చేస్తాయి. కానీ... రచన, దర్శకత్వం అనేవి ఎంతో కష్టమైన బాధ్యతలు. 'ఆత్రేయ రాసి ప్రేక్షకులను, రాయిక నిర్మాతలను ఏడిపిస్తారు' అని విమర్శ ఉంది. 'మురళీకృష్ణ' పాత్ర పాటల కోసం సి. పుల్లయ్య గారి కోపం కూడా ప్రస్తావించారు. 'నీ సుఖమే నేను కోరుతున్న' పాట పుట్టుక నేపథ్యం తెలిసిందే. అటువంటి ఆత్రేయ 'దర్శకత్వం' చేయటం సాహసమనేది ఆనాటి ఆయన అభిమానుల అభిప్రాయం. ఆయన మంచి నటుడు కూడా. 'కోడెనాగు' (కౌముది వారిలో) శోభన్ బాబుకు గురువుగా వేశారు. రచయిత, నటుడు, దర్శకుడుగా ఆత్రేయ ప్రతిభను కాదనటానికి ఆ ఫాలాక్షునికి కూడా ధైర్యం చాలదు. గీత రచయితగా అతనిది మన'సు కవి'గా శాశ్వతముద్ర. నాటి ఆత్మబలం నుంచి నిన్న మొన్నటి 'ప్రేమ్ నగర్', 'దసరా బుల్లోడు' వరకు ఆయనకున్నన్ని 'హిట్స్' మరొకరికి లేవు. బహుముఖి ప్రతిభ మూర్తి 'ఆత్రేయ'. ఆయన తెలుగువారి ఆస్తి. 'పాట' భూమి మీద ఉన్నంతకాలం 'ఆత్రేయ' ఉంటారు. 'కళ్ళలో ఉన్నదేదో..', 'మౌనమే నీ బాగబాగ.. ' ఇలా ఎన్నెన్నో. పైడిపాల గారు చేసిన పరిశోధన ఇందుకు ఓ గొప్ప ఉదాహరణ. 'ఆత్రేయ' గారిని పైడిపాలగారు సంపూర్ణంగా ఆవిష్కరించారు. 'ఆత్రేయ' తెలుగువారికి మాత్రమే లభించిన 'వరం'. అతనిని మరవటం అసాధ్యం.

**ఆధార గ్రంథాలు:**

తెలుగు సాహిత్య చరిత్ర, ద్వానా శాస్త్రి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
తెలుగు సాహిత్య సమీక్ష, జి నాగయ్య, ప్రజాశక్తి పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
తెలుగులో సంప్రదాయాలు ప్రయోగాలు, డా. సి నారాయణ రెడ్డి, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్